క్లుప్తంగా

5న వాలీబాల్ పోటీలు

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల నియోజకవర్గ స్థాయిలో ధర్మవరంలో ఈ నెల 5న వాలీబాల్ పోటీలు నిర్వహించనున్నట్లు అసిరితల్లి యువజన సంఘం ప్రతినిధులు శనివారం ఒక ప్రకటనతో తెలిపారు. నాకౌట్ పద్ధతిలో పోటీలు జరుగుతాయని, ఆసక్తి గల జట్లు 9100213868, 7306766961 నంబర్లను సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

మహాలక్ష్మి కల్యాణానికి పందిరిరాట



కల్యాణరాట వేస్తున్న ఆలయ కమిటీ మహిళలు

రణస్థలం: రథసప్తమి సందర్భంగా కమ్మసిగడాం మహాలక్ష్మి తల్లి కల్యాణరాట మహోత్సవం శనివారం ఘనంగా జరిగింది. రథసప్తమి నుంచి మూడో రోజున ఈ నెల 30న అమ్మవారి కల్యాణం జరిపించి జాతరను ప్రారంభిస్తామని ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి ఎస్.ఈశ్వరరావు తెలిపారు. జాతర ఏర్పాట్లపై కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. సాంస్కృతిక కార్యక్రమాలు, దుకాణాల ఏర్పాటు, ట్రాఫిక్, పార్కింగ్ వంటి పలు అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఈశ్వర కల్యాణానికి పందిరిరాట



పందిరిరాట వేస్తున్న అర్చకులు

గార: శ్రీకూర్మనాథాలయ అనుబంధ ఆలయమైన పాతాళ సిద్ధేశ్వర ఆలయంలో భీష్మ ఏకాదశి సందర్భంగా శనివారం కల్యాణ పందిరి రాట వేశారు. ఆలయ ప్రధానార్చకులు పెంట జగన్నాథశర్మ, అర్చకులు ఇప్పిలి శ్రీనివాసశర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. బుధవారం జరిగే కల్యాణోత్సవానికి అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని ఆలయ ఈవో జి.గురునాథం తెలిపారు.

లాలా లజపతిరాయ్‌కు నివాళి



లజపతిరాయ్ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న నాయకులు

లావేరు: పెదలింగాలవలసలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో స్వాతంత్ర్య సంగ్రామ యోధుడు లాలా లజపతిరాయ్ జయంతి శనివారం నిర్వహించారు. సర్పంచ్ ఉకలాపు యశోద, ఏఎంసీ మాజీ డైరెక్టర్ ఉకలాపు అప్పలనాయుడు తదితరులు లజపతిరాయ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లజపతిరాయ్ 1919లో అమృతసర్‌లో జరిగిన ఊచకోతకు వ్యతిరేకంగా పోరాడి దేశభక్తిని చాటుకున్నారని గుర్తు చేశారు. సైమన్ కమిషన్‌కు వ్యతిరేకంగా ఉద్యమం నడిపారని చెప్పారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు శివాంగం నాగరాజు, గొర్లె రామినాయుడు, నాయకులు మీసాల నారాయణరావు, పతివాడ గురునాయుడు, ఉకలాపు లక్ష్మణరావు, బొబ్బాది అప్పారావు, గొర్లె సూర్యనారాయణ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ

జి.సిగడాం: బాతువ వైఎస్సార్‌సీపీ నాయకుడు, సహకార సంఘం మాజీ అధ్యక్షుడు ముల్లు నారాయణప్పడు అనారోగ్యంతో బాధపడుతుండటంతో ఆయన్ను శనివారం ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ పరామర్శించారు. ఎమ్మెల్యేతోపాటు మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితుడు మీసాల వెంకటరమణ, మండల బూత్ కన్వీనర్ ఆబోతుల జగన్నాథం, ఎంపీటీసీ బి.అప్పారావు, కార్యకర్తలు ఉన్నారు.

సెల్‌ఫోన్ అందజేత



ప్రయాణికుడికి సెల్ అందజేస్తున్న ఎస్‌ఎం శామ్యూల్

శ్రీకాకుళం అర్బన్: శ్రీకాకుళం నానుబాలవీధికి చెందిన ఎం.వి.సీతారామరాజు శనివారం విశాఖపట్నం నుంచి ఆర్టీసీ బస్సులో వస్తూ సెల్‌ఫోన్‌ను బస్సులో జారవిడుచుకున్నారు. బస్ డ్రైవర్ డి.ఆర్.కుమార్‌కు ఫోన్ దొరకడంతో ఎస్‌ఎం శామ్యూల్‌కు అందజేశారు. తగిన ఆధారాలు చూపించడంతో సెల్‌ఫోన్‌ను సీతారామరాజుకు అప్పగించారు. కార్యక్రమంలో ఈయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పలిశెట్టి దామోదరరావు ఉన్నారు.



ధర్మశాస్త సన్నిధానం ఆధ్వర్యంలో ఉచిత రక్తదాన శిబిరం



భక్తుల కోసం అన్నదానం



చక్కెరపొంగలి పంపిణీ చేస్తున్న ఏపీఈపీడీసీఎల్ సిబ్బంది

భక్తుల సేవలో..!

- రద్దీకి తగ్గట్లు ఏర్పాట్లు చేసిన స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు
- వృద్ధులు, దివ్యాంగులకు ప్రత్యేక రవాణా సేవలు



వీల్‌చైర్ ద్వారా వృద్ధురాలిని ఆలయానికి తీసుకువెళుతున్న రెడ్‌క్రాస్ సభ్యులు

శ్రీకాకుళం అర్బన్:

రథసప్తమి పర్వదినం సందర్భంగా సూర్యనారాయణస్వామి దర్శించుకునేందుకు వచ్చే భక్తులు ఇబ్బందులు పడకుండా ఉండేందుకు పలు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు సేవలందించారు. భక్తుల రద్దీకి అనుగుణంగా ఏర్పాట్లు చేశారు. అరసవల్లిలోని శర్వాణి విద్యాలయ, ముత్యాలమ్మ వాకర్స్‌క్లబ్, ఏడురోడ్ల కూడలి సంయుక్త ఆధ్వర్యంలో భక్తులకు టీ, స్నాక్స్ అందజేశారు. కార్యక్రమంలో శర్వాణి విద్యాలయ అధినేత అంధవరపు సూరిబాబు , ప్రతినిధులు అంధవరపు కేశవరావు, జామి వరహాలు, కొంచాడ రమేష్, బరాటం బాబ్జి, కృష్ణ తదితరులు పాల్గొన్నారు. ఏపీఈపీడీసీఎల్ ఆధ్వర్యంలో భక్తులకు పులిహోర, చక్కెరపొంగలి అందజేశారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ ఇంజనీర్ ఎల్.దైవప్రసాద్, ఈఈ ఎస్.బైరినాయుడు, ఏఈ డీ1 కమల్‌హాసన్, ఎస్.సునీల్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు. ధర్మశాస్త సన్నిధానం గురుస్వామి బరాటం సంతోష్, శిష్యబృందం ఆధ్వర్యంలో ఉచిత రక్తదానశిబిరాన్ని ఏర్పాటు చేశారు. అయ్యప్ప భక్తులు, గురుస్వాములు, శిష్యబృందం రక్తదానం చేయగా.. న్యూబ్లడ్ బ్యాంక్, లయన్స్ ఇంటర్నేషనల్ బ్లడ్‌బ్యాంక్, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీకి బ్లడ్ యూనిట్లు అందజేశారు. నగరంలోని ఇల్లీసుపురంలోని స్నేహ సేవా సంఘం ఆధ్వర్యంలో అరసవల్లి భక్తులకు ఉచితంగా పులిహోర, చక్కెర పొంగలి అందజేశారు. సూర్యనారాయణస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో చిన్నారులు, వృద్ధులకు పాలు పంపిణీ చేశారు. నగరంలోని ఎస్ఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు సూర శ్రీనివాసరావు సౌజన్యంతో భక్తులకు పులిహోర, చక్కెర పొంగలి, మంచినీరు అందజేశారు. జీటీ రోడ్డులోని జీఎస్ జ్యూయలరీ ఆధ్వర్యంలో ఉచిత మజ్జిగ పంపిణీ చేశారు. ఆర్‌కే స్టోర్ ఆధ్వర్యంలో అరసవల్లి భక్తులకు ఉచితంగా బిరియానీ, పులిహోర, చక్కెరపొంగలి పంపిణీ



శర్వాణి విద్యాలయలో భక్తులకు టీ, స్నాక్స్ అందజేస్తున్న అంధవరపు సూరిబాబు

చేశారు. హయాతినగరంలోగల కళింగకోమటి సేవా సంఘం ఆధ్వర్యంలో భక్తులకు ఉచితంగా అన్నప్రసాదవితరణ చేశారు. కార్యక్రమంలో కళింగ కోమటి సేవా సంఘం అధ్యక్ష, కార్యదర్శులు పొట్నూరు సీతారామగుప్త, కొత్తకోట రమేష్‌కుమార్, ఉపాధ్యక్షుడు జామి వెంకటరమణ, సిబ్బంది పాల్గొన్నారు. ఉషాకిరణ్ ట్రేడింగ్-కో ఆధ్వర్యంలో ఆ సంస్థ అధ్యక్షుడు పి.కాళిదాస్ సౌజన్యంతో భక్తులకు హల్వా, పులిహోర, కొమ్ముశనగలు, బఠాని, చక్కెర పొంగలి అందజేశారు. సత్యసాయి సేవా సంఘం ఆధ్వర్యంలో భక్తుల పాదరక్షలు, బ్యాగ్‌లను ఉచితంగా భద్రపరిచారు. మహిళలకు 30కేజీల పసుపు కుంకుమ, అరటిపండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సేవా సం



అరసవల్లి దేవస్థానం ఆధ్వర్యంలో పాలు పంపిణీ

స్థల కో-ఆర్డినేటర్ సూర రామచంద్రరావు, అధ్యక్షుడు ఎన్ని లింగరాజు, సిబ్బంది పాల్గొన్నారు. మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో వెలమవీధి యూత్ పాల్గొన్నారు. సౌత్ ఇండియా షాపింగ్‌మాల్ ఆధ్వర్యంలో భక్తులకు ఉచితంగా అన్నదానం, మజ్జిగ పంపిణీ చేశారు. మేనేజర్‌లు సురేష్, ఉమామహేష్, సిబ్బంది పాల్గొన్నారు. పుణ్యపువీధిలోని సీతారామచంద్రమూర్తి సహిత సువర్చల అభయాంజనేయస్వామి ఆలయం ఆధ్వర్యంలో ఉచిత ప్రసాద వితరణ చేశారు. నగరపాలకసంస్థ ఆధ్వర్యంలో అరసవల్లి కూడలి, ఇందిరావిజ్ఞానభవన్, అరసవల్లి మామిడితోట మంచినీరు పంపిణీ చేశారు. వృద్ధులు, దివ్యాంగులు అసౌకర్యానికి గురికాకుండా రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో వీల్‌చైర్ ఏర్పాటు చేశారు. అరసవల్లి కూడలి నుంచి నేరుగా అనివెట్టి



భక్తులకు పులిహోర, మంచినీరు పంపిణీ చేస్తున్న లయన్స్‌క్లబ్ ప్రతినిధులు



సత్యసాయి ఆధ్వర్యంలో పాదరక్షలు, బ్యాగ్‌లు భద్రపరుస్తున్న దృశ్యం

మండపం వరకూ వీల్‌చైర్ ద్వారా దివ్యాంగులు, వృద్ధులను తీసుకువెళ్లారు. జెమ్స్ ఆస్పత్రి, శివాని ఫార్మసీ కళాశాల, వైద్య ఆరోగ్యశాఖల ఆధ్వర్యంలో పలుచోట్ల ఉచిత వైద్యశిబిరాలు ఏర్పాటు చేసి మందులు పంపిణీ చేశారు. లయన్స్‌క్లబ్ న్యూ సెంట్రల్ ఆధ్వర్యంలో అధ్యక్షుడు హరికాప్రసాద్, బాడాన దేవభూషణరావు, నటుకుల మోహన్, డా.చింతాడ కృష్ణమోహన్, పొన్నాడ రవికుమార్‌లు పులిహోర, మంచినీరు పంపిణీ చేశారు.

ఆదిత్యా నమోస్తుతే..



రాత్రి వేళ క్యూలైన్లలో వేచి ఉన్న భక్తులు



స్వామిని దర్శించుకునేందుకు వస్తున్న దివ్యాంగుడు



దర్శనం కోసం క్యూలో ఉన్న భక్తులు



స్వామివారి దర్శనం కోసం వేచి చూస్తూ..



ఆలయం వద్ద భక్తుల సందడి



క్యూలైన్‌లో ఉన్న భక్తులు

రథసప్తమి సందర్భంగా అరసవల్లి సూర్యనారాయణమూర్తిని భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి దర్శించుకున్నారు. శుక్రవారం అర్ధరాత్రి నుంచి శనివారం రాత్రి 10 గంటల వరకు భక్తుల తాకిడి కనిపించింది.

– సాక్షి నెట్‌వర్క్

ఆకట్టుకున్న దీపారాధన



1001 దీపాలతో అమ్మవారికి దీపారాధన

శ్రీకాకుళం కల్చరల్: బలగలోని బాలత్రిపుర కాలభైరవ పీఠం దేవాలయంలో రాజశ్యామలా నవరాత్రి ఉత్సవాల సందర్భంగా అమ్మవారికి గణేష్ గురూజీ ఆధ్వర్యంలో 1001 దీపాలతో దీపారాధన చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఘనంగా సూర్య నమస్కారాల ప్రదర్శన



సూర్యనమస్కారాలు చేస్తున్న మహిళలు

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని విశాఖ-బి కాలనీలోని షిరిడిసాయి మందిరం యోగా హాలులో 108 సూర్యనమస్కారాల ప్రదర్శన శనివారం రథసప్తమి సందర్భంగా నిర్వహించారు. మంత్ర ఉచ్చారణతో మహిళలంతా కలిసి సూర్య నమస్కారాలు చేశారు.

పకడ్బందీగా భద్రతా ఏర్పాట్లు

శ్రీకాకుళం క్రైమ్/రూరల్ : రథసప్తమి సందర్భంగా అరసవిల్లిలో ఏర్పాటు చేసిన భద్రతా ఏర్పాట్లను ఎస్పీ జి.ఆర్.రాధిక శనివారం పర్యవేక్షించారు. దైవ దర్శనానికి వచ్చిన స్టేట్ ప్రిన్సిపల్ సెక్రటరీ ఆఫ్ హోమ్ డీజీజీ విజయ్‌కుమార్, విశాఖ రేంజి డీఐజీ ఎస్.హరికృష్ణ భద్రతా ఏర్పాట్లను ఎస్పీని అడిగి తెలుసుకున్నారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా చూడాలన్నారు. అడిషనల్ ఏఎస్పీ టి.పి.విఠలేశ్వరరావుతో పాటు ఆరుగురు డీఎస్పీలు, జిల్లా నలుమూలల నుంచి వచ్చిన సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు, ఎస్ఐలతో కూడిన 1200 మంది బందోబస్తు విధులు నిర్వర్తించారు. భద్రతా చర్యల్లో భాగంగా కమాండ్ కంట్రోల్ రూం నుంచి ఆలయ పరిసరాలు, పుష్కరిణి వద్ద భద్రతలను ఎస్పీ పర్యవేక్షించారు. పోలీసు వలంటీర్లుగా సేవలందించిన విద్యార్థుల వద్దకు వెళ్లి ఫలహారం ఏర్పాట్లను పర్యవేక్షించారు.



కమాండ్ కంట్రోల్ రూం నుంచి భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న ఎస్పీ రాధిక

ఘనంగా రథసప్తమి పూజలు



లావేరు: దుర్గాదేవి ఆలయంలో పూజల్లో పాల్గొన్న భక్తులు

లావేరు: రథసప్తమి పర్వదినం సందర్భంగా శనివారం అన్ని గ్రామాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. బొడ్డపాడు, పాతకుంకాం, లావేరు, వెంకటాపురం, అదపాక, మురపాక, బెజ్జిపురం, తామాడ, లకేశవరాయునిపాలెం, గురుగుబిల్లి గ్రామాల్లో సూర్యనారాయణస్వామి, శివాలయాలు, దుర్గాదేవి, సంతోషిమాత, ఆంజనేయస్వామి, అయ్యప్ప స్వామి, బాబా ఆలయాల్లో భక్తుల రద్దీ నెలకొంది.

శ్రీకాకుళం కల్చరల్: పీఎస్.కాలనీలోని వరసిద్ధి వినాయక పంచాయతన దేవాలయాల్లో ఒకటైన సూర్యనారాయణస్వామికి రథసప్తమి సందర్భంగా ప్రత్యేక అలంకరణ చేశారు. ఆలయ ధర్మకర్త పి.జగన్మోహనరావు ఆధ్వర్యంలో స్వామివారికి పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. అనంతరం స్వామికి నైవేద్యం సమర్పించారు.



శ్రీకాకుళం కల్చరల్: పీఎస్‌కాలనీలో ఆదిత్యునికి ప్రత్యేక అలంకరణ



గార: బుద్ధా పాఠశాల విద్యార్థుల సూర్యనమస్కారాలు

గార: కె.మత్స్యలేశంలోని బుద్ధా పాఠశాలలో రథసప్తమి సందర్భంగా విద్యార్థులు సూర్యనమస్కారాలు చేశారు. కరస్పాండెంట్ బి.ఎర్రన్న, సర్పంచ్ బి.లలిత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సచివాలయాలతో గ్రామ స్వరాజ్యం

- ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్

రణస్థలం: ప్రజలకు సంక్షేమ పథకాలు సత్వరమే అందించాలనే దృఢ సంకల్పంతో గ్రామ సచివాలయాల వ్యవస్థను సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నెలకొల్పారని ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. చిల్లపేటరాజాంలో రూ.40లక్షల ఉపాధి హామీ నిధులతో నిర్మించిన నూతన గ్రామ సచివాలయ భవనాలను శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్య పాలనకు పక్కా ప్రభుత్వ భవనాలు, సచివాలయ ఉద్యోగుల పనితీరే నిదర్శనమని చెప్పారు.

సచివాలయాల్లో రేషన్ కార్డుకు దరఖాస్తు చేసుకున్న క్షణాల్లోనే మంజూరు చేస్తున్నారని, ఆరోగ్యశ్రీ కార్డు, పింఛన్, కుల ధ్రువీకరణ పత్రాలు ఏది కావాలన్నా వలంటీర్లు వచ్చి వివరాలు నమోదు చేసుకొని గ్రామ సచివాలయాల ద్వారా నిర్దేశిత వ్యవధిలో అందజేస్తున్నారని వివరించారు. రైతుల కోసం ఆర్‌బీకేలు అందుబాటులోనికి తీసుకువచ్చారని చెప్పారు. విలేజ్ క్లినిక్‌ల ద్వారా గ్రామీణలకు సంపూర్ణ ఆరోగ్యం అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పీఆర్ డీఈ సీతంనాయుడు, మండల ప్రత్యేకాధికారి బీహెచ్ దుర్గారావు, ఎంపీడీ ఓ వి.ధనుంజరావు, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పిన్నింటి సాయికుమార్, జెడ్పీటీసీ టొంప ల సీతారాం, పంచాయతీ సర్పంచ్ కంబపు అసిరితల్లి, ఎంపీటీసీ ఆళ్ల పార్వతిదేవి, నాయకులు కంబపు నరసింహులు రెడ్డి, కొణతాల లక్ష్మణరెడ్డి, చిల్ల వెంకటరెడ్డి, పాపినాయుడు, నల్లబోతుల సత్యనారాయ ణ, సూరి, దేవుడప్పడు, చిల్ల తాతయ్య, బండారు కృష్ణ, సీరపు అప్పారావు, తాతారావు, రమణ, గుర్ల అప్పన్న, కురిమిన గోవింద తదితరులు ఉన్నారు.



చిల్లపేటరాజాంలో గ్రామ సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

ఇంటి పన్ను సకాలంలో చెల్లించాలి

లావేరు: ఇంటి పన్ను సకాలంలో చెల్లించాలని తాళ్లవలస పంచాయతీ కార్యదర్శి ఎం.శ్రీనివాసరావు అన్నారు. పంచాయతీ పరిధిలోని సుభద్రాపురంలో ఇంటి పన్ను వసూలుపై శనివారం మెగా డ్రైవ్ నిర్వహించారు. కార్యదర్శి, వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి ఇంటి పన్ను కట్టించుకున్నారు. సకాలంలో పన్ను చెల్లిస్తే పంచాయతీలో అభివృద్ధి పనులు చేయడానికి వీలు కలుగుతుందన్నారు.



పన్ను చెల్లించిన వారికి రశీదు అందజేస్తున్న కార్యదర్శి శ్రీనివాసరావు

వేంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు

శ్రీకాకుళం కల్చరల్: నారాయణ తిరుమల కొండపై వెలసిన వేంకటేశ్వరుని ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. రథసప్తమి పర్వదినం కావడంతో అష్టోత్తర శతనామాలతో పూజలు, ప్రత్యేక దర్శనాలు, ఉచిత దర్శనాల భక్తులతో ఆలయం రద్దీగా మారింది. అర్చకులు గురుగుబెల్లి శ్రీనివాసులు భక్తుల గోత్రనామాలతో అర్చనలు చేయించి పూజలు చేశారు. వేంకటరామానుజ సేవాదళం ఆధ్వర్యంలో సామూహిక విష్ణు సహస్ర నామ పారాయణ నిర్వహించారు.

అంబేడ్కర్ ఆశయసాధనకు కృషి



సీతారాంపురంలో అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

- ఎచ్చెర్ల ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

రణస్థలం: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి చేద్దామని ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. రణస్థలం మండలం తెప్పలవలస పంచాయతీ సీతారాంపురంలో మాజీ సర్పంచ్ దన్నాన సత్యం జ్ఞాపకార్థం వైఎస్సార్‌సీపీ నాయకుడు దన్నాన హరి సహకారంతో ఏర్పాటు చేసిన అంబేడ్కర్ విగ్రహాన్ని ఎమ్మెల్యే శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబేడ్కర్ కుల మత పార్టీలకు అతీతంగా ప్రపంచానికే అందరివాడని పేర్కొన్నారు అంబేడ్కర్ రచించిన రాజ్యాంగం ప్రపంచానికే ఆదర్శమని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పిన్నింటి సాయికుమార్, జెడ్పీటీసీ టొంపల సీతారాం, వైఎస్సార్ సీపీ మండల నాయకులు మహంతి పెదరామినాయుడు, చిల్ల వెంకటరెడ్డి, మైలపల్లి కామరాజు, మహంతి చినరామునాయుడు, గొర్లె అప్పలనర్సునాయుడు, దన్నాన హరి, బొమ్మలాట శ్రీరాములు, ఎంపీటీసీ చోడవరపు శాంతమ్మ, దన్నాన నర్సునాయుడు, బుడుమూరు యల్లారావు, ఏపీ దళిత మహాసభ జిల్లా ప్రధాన కార్యదర్శి డి.రాము, చోడవరపు రమణ, అచ్చివాడు, పైడయ్య, రామారావు తదితరులు పాల్గొన్నారు.